క్లుప్తంగా

16 నుంచి శ్రీవారి ఆలయంలో పవిత్రోత్సవాలు



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న అర్చకులు, దేవస్థానం సిబ్బంది

కాళ్ల: మండలంలోని కాళ్లకూరులో ఉన్న స్వయంభూః శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 16వ తేదీ మంగళవారం నుంచి 20వ శనివారం వరకు సప్తనది జలాభిషేక పూర్వక పవిత్రోత్సవాలు నిర్వహించనున్నట్లు దేవస్థానం ఈఓ ఎం.అరుణ్ కుమార్ తెలిపారు. శనివారం దేవస్థానంలో పవిత్రోత్సవాల కరపత్రాలు ఆలయ అర్చకులతో కలిసి ఆవిష్కరించారు. ఐదు రోజుల పాటు ఆలయంలో స్వామివారికి ప్రత్యేక నిర్వహించి, 20న శనివారం 7 పుణ్యనదుల నుంచి తెచ్చిన పవిత్రజలాలతో స్వామి వారికి జలాభిషేకం నిర్వహిస్తామన్నారు.

మాదకద్రవ్యాల నివారణపై అవగాహన

వీరవాసరం: మండలంలోని రాయకుదురు హైస్కూల్‌లో జిల్లా ఈగల్ సెల్ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాలకు దూరంగా ఉందాం-విలువైన ప్రాణాన్ని కాపాడుకుందాం అనే అంశంపైన ప్రధానోపాధ్యాయుడు కానుకొలను శ్రీనివాసరావు అధ్యక్షతన అవగాహన కల్పించారు. ఈగల్ సెల్ కానిస్టేబుల్స్ మురళి, నాగేశ్వరావు మత్తు పదార్థాలు సేవించడం వల్ల వచ్చే లక్షణాలు, అనర్థాలు, పొగాకు ఉత్పత్తుల వాడకం వల్ల వచ్చే రోగాలు, డ్రైవింగ్ లైసెన్సు లేకుండా డ్రైవ్ చేయడం ద్వారా జరిగే అనర్థాలపై విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ఈగల్ సెల్ కన్వీనర్స్ పి.గజేంద్ర గట్కర్, సీహెచ్ కిరణ్ కుమార్, సాకా వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం




విరాళం అందిస్తున్న భక్తులు

భీమవరం (ప్రకాశంచౌక్): స్థానిక శ్రీ మావుళ్ళమ్మ అమ్మవారి శాశ్వత నిత్యాన్నదాన వితరణకు భీమవరానికి చెందిన ఎం.వెంకట గోపాల సత్యనారాయణ శర్మ కుటుంబ సభ్యులు రూ.లక్ష, వారి సంస్థ శ్రీఖర ఇంజినీరింగ్ సర్వీసెస్ భీమవరం పేరుపై ఆలయ అభివృద్ధి పనులకు రూ.లక్ష అందించారు. వీరికి ఆలయ ఉప ప్రధాన అర్చకులు కొప్పేశ్వరరావు ఆశీర్వచనాలు నిర్వహించారు.ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి నగేష్ దాతలకు ప్రసాదాలు, శేషవస్త్రం, ఫొటో అందజేశారు.

వ్యక్తిపై దాడి

ఆకివీడు: మండలంలోని దుంపగడప గ్రామ శివారు పల్లెపాలెం గ్రామానికి చెందిన బొడ్డు గణేష్ అనే వ్యక్తిని అదే గ్రామానికి చెందిన కొల్లాటి జీవిమణికంఠ అనే వ్యక్తి పాత గొడవల నేపథ్యంలో దాడి చేశాడు. దీంతో బాధితుడు బొడ్డు గణేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మణికంఠపై ఆదివారం కేసు నమోదు చేశామని ఆకివీడు ఎస్సై హనుమంతు నాగరాజు తెలిపారు.

గుమ్ములూరులో అన్నసమారాధన



అన్నసమారాధన నిర్వహిస్తున్న దృశ్యం

ఆకివీడు: వినాయక చవితి ఉత్సవాలు ముగింపు సందర్భంగా మండలంలోని గుమ్ములూరు గ్రామంలో శనివారం అఖండ అన్నసమారాధన నిర్వహించారు. రామాలయ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో 32 వంటకాలతో భక్తులకు భోజనాన్ని అందించారు. గ్రామంలోని ప్రజలతో పాటు చుట్టు ప్రక్కల గ్రామాల ప్రజలు కూడా అఖండ అన్నసమారాధనలో పాల్గొన్నారు.

రేషన్ దుకాణాల్లో కానరాని కందిపప్పు

- బహిరంగ మార్కెట్‌లో అధిక ధర
- పేద, మధ్య తరగతి ప్రజలు సతమతం



కందిపప్పు



రేషన్ దుకాణాల ద్వారా సరఫరా చేసిన కందిపప్పు ప్యాకెట్లు (ఫైల్)

పాలకోడేరు: ప్రజలు నిత్యం వాడే సరుకులలో కందిపప్పు ఒకటి. కందిపప్పు ధర ఆకాశాన్నంటినా వారంలో రెండు మూడు రోజులకు ఒకసారి అయినా కందిపప్పు వాడాల్సిందే. అలాంటి నిత్యావసర సరుకును గత ప్రభుత్వం పేదలకు ప్రతి నెలా రేషన్ రవాణా ద్వారా సరఫరా చేసేది. ఆ తరువాత అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం ఏడాదిన్నర కావస్తున్న ఇప్పటికి రేషన్ దుకాణాల్లో కందిపప్పు కనిపించడం లేదు. అడిగిన ప్రతి సారి వచ్చే నెల వస్తుందని డీలర్లు చెప్పడం తప్ప వచ్చిన దాఖలాలు కనిపించడం లేదు. అసలు ఎప్పుడు అందుబాటులోకి తెస్తారో కూడా తెలియని పరిస్థితి నెలకొన్నాయి.

కందిపప్పు కిలో రూ.150

నియోజకవర్గంలో కాళ్ల, ఆకివీడు, పాలకోడేరు, ఉండి మండలాలు ఉన్నాయి. పాలకోడేరు మండలంలో 21,459, కాళ్ల మండలంలో 21,887, ఆకివీడు మండలంలో 20,675, ఉండి మండలంలో 22,011 కార్డుదారులు ఉన్నారు ప్రస్తుతం బహిరంగ మార్కెట్లలో కందిపప్పు ధర రూ.100 నుంచి రూ.150వరకు ఉంది పేద మధ్య తరగతి ప్రజలు కందిపప్పు కొనలేని పరిస్థితులు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వం సరఫరా చేసిన విధంగా ప్రతి కార్డుకి కిలో కందిపప్పు అందించాలని కోరుతున్నారు. కందిపప్పు సరఫరాపై కార్డుదారులు డీలర్ల వద్ద వాకబు చేస్తున్నా సరైన సమాధానం లేకపోవడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొందరు కార్డు దారులు బియ్యం ఒకటి ఇస్తే ఏం చేసుకోవాలి? కుటుంబానికి సరిపడా కందిపప్పు, మంచి నూనె తదితర నిత్యావసర సరుకులు అందించాలని బహిరంగంగానే ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం, అధికారులు పేద మధ్య ప్రజలు ఆవేదనను పరిగణలోకి తీసుకుని రేషన్ దుకాణాల ద్వారా కందిపప్పు, మంచునూనెని సరఫరా చేయాలని కోరుతున్నారు.

పేదలకు పంపిణీ చేయాలి



రేషన్ షాపుల్లో కందిపప్పు సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. అధికారంలోకి వచ్చాక ప్లేటు ఫిరాయించారు. నిత్యావసర సరుకులు కందిపప్పు, వంట నూనెతో ఇతర సరుకులను రేషన్ కార్డుదారులకు అందించడం సర్కార్ బాధ్యత. పేదలకు అవసరమైన కందిపప్పును రేషన్ దుకాణాల ద్వారా పంపిణీ చేయాలి.

– కె.లాజరు కుముదవల్లి

కందిపప్పు లేదంటున్నారు



రేషన్ షాపుల్లో బియ్యం, పంచదార మాత్రమే ఇస్తున్నారు. కందిపప్పు అడిగితే ప్రభుత్వం నుంచి రాలేదని డీలర్లు చెబుతున్నారు. గతంలో రేషన్ షాపుల్లో రూ.67కే కందిపప్పు ఇచ్చేవారు. దీని వల్ల కుటుంబానికి కొంత ఆసరాగా ఉండేది ఇప్పటికైనా ప్రభుత్వ పెద్దలు చొరవ చూపి పేద కుటుంబాలను ఆదుకోవాలి. బయట మార్కెట్‌లో కందిపప్పును కొనలేకపోతున్నాం.

– ఎంఆర్ లక్ష్మి, మో గల్లు

కందిపప్పు సరఫరా చేయాలి



గత ప్రభుత్వం ఇచ్చిన విధంగా ప్రతి కార్డుదారుడికి కందిపప్పును అందించాలి. గ్రామీణ ప్రాంతాల్లో చాలా వరకు పేద మధ్య తరగతి వారే ఉన్నారు.బయట మార్కెట్ లో కందిపప్పు రూ.100 నుంచి రూ159 వరకు అమ్ముతున్నారు. పేద మధ్య తరగతి వారు చాలా ఇబ్బంది పడుతున్నారు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కందిపప్పు ను అందించాలి.

– లీలా ప్రియ, కుముదవల్లి

పూరి గుడిసె దహనం చేసిన వ్యక్తి అరెస్ట్

నరసాపురం: మొగల్తూరు సెంటర్‌లో ఉన్న ముత్యాలమ్మ వారి పూరిగుడిసె ఈ నెల 9న అగ్నికి ఆహుతైన ఘటన ప్రమాదం కాదని పోలీసులు దర్యాప్తులో తేల్చారు. ఎప్పటి నుంచో ఉంటున్న పూరి గుడిసె స్థానంలో సంప్రదాయం పక్కన పెట్టి సిమెంట్ షెడ్డు నిర్మిస్తున్నారనే కోపంతో మొగల్తూరు గ్రామానికే చెందిన చేపలు అమ్ముకుని జీవించే తోట శ్రీనివాస్ అనే వ్యక్తి తగలబెట్టినట్టు నిర్ధారించారు. శనివారం నరసాపురం డీఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఏఎస్పీ భీమారావు వివరాలు వెల్లడించారు. సున్నితమైన ఈ అంశాన్ని పోలీసు శాఖ చాలా సీనియస్‌గా తీసుకుని దర్యాప్తు చేపట్టిందని చెప్పారు. ఏలూరు రేంజ్ ఐజీ, జిల్లా ఎస్పీ పర్యవేక్షణలో 5 ప్రత్యేక బృందాలు ఏర్పడి దర్యాప్తు సాగించాయని చెప్పారు. సీసీ కెమెరాల ద్వారా సాగిన దర్యాప్తులో నిందితుడిని గుర్తించామన్నారు. నిందితుడు నేరం అంగీకరించాడని పేర్కొన్నారు. సమావేశంలో నరసాపురం డీఎస్పీ డాక్టర్ శ్రీవేద, నరసాపురం, పాలకొల్లు, పెనుగొండ, మొగల్తూరు పోలీసులు పాల్గొన్నారు.

వాన తెచ్చిన తంటా

శనివారం కురిసిన భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాలతో పాటు రాష్ట్ర రహదారి జలమయ్యమయ్యాయి. ప్రధాన రహదారితోపాటు అంతర్గత రహదారులు వర్షపు నీటితో నిండాయి. రాష్ట్ర రహదారి సైతం వర్షపు నీటితో కాలువలను చెరువులను తలపించింది. గ్రామంలో పల్లపు వీధి జలమయమైంది. దీంతో స్థానికులు, వాహనదారులు బయటికి రావడానికి ఇబ్బందులు పడ్డారు. ప్రధానంగా సినిమా హాల్ సెంటర్, కాళ్ల శివాలయం, తహసీల్దార్ కార్యాలయం వద్ద, కాళ్ళకూరు, జక్కరం, సీసలి గ్రామల పరిధిలో రాషట్ర రహదారిపై వర్షపు నీరు కాలువలను తలపించేలా మారాయి. డ్రైనేజీ సౌకర్యం లేకపోవడంతో నీరు వెళ్లే మార్గం లేక వర్షపు నీళ్ళు నిలబడి పోతున్నాయని స్థానికులు వాపోతున్నారు. - కాళ్ల



కాళ్లలో కాలువలా మారిన పల్లపు వీధి



తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా నిలిచిన వర్షపు నీరు



సినిమా హాల్ సెంటర్‌లో భారీ వర్షంతో వర్షపు నీటిలో ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

కుష్టు వ్యాధిపై అవగాహన



ఆర్ఎంపీ, పీఎంపీల సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం: కుష్టువ్యాధి అంటే సాధారణ అంటు వ్యాధువంటిదని అది ఒక క్రిమి కారకంగా కలిగే రోగమని ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యుల సంఘం ఉభయ గోదావరి జిల్లాల కో-ఆర్డినేటర్ ఎం.రంగనాథరావు, జిల్లా కో-ఆర్డినేటర్ ఆలమూరి బాబ్జీ అన్నారు. భీమవరంలో శనివారం బ్రైటర్ ఫ్యూచర్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రీచ్ మీ ప్రాజెక్ట్ ద్వారా పట్టణంలోని ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యులకు కుష్టువ్యాధి, పైలేరియా వ్యాధులపై నిర్వహించిన ఆరోగ్య అవగాహన శిక్షణ కార్యక్రమంలో మాట్లాడారు. కుష్టు వ్యాధి రెండు రకాలుగా కలుగుతుందని మన దేశంలో 80 శాతం కుష్టు రోగం అంటుకాని రకానికి చెందినదేనన్నారు. ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యులు వీటిపై పూర్తి అవగాహనతో వైద్య సేవలందించాలన్నారు. ఈ కార్యక్రమంలో దళిత ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుందరకుమార్, డీఎస్ రత్నకుమార్, గొల్ల రాజ్‌కుమార్, పెట్టేం శుభాకర్, అంబటి ఆనందకుమార్, తుళ్ళూరు చంటి, సుధ, పాక రత్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఏచూరికి ఘన నివాళి

భీమవరం: సీపీఎంకు, కమ్యూనిస్టు ఉద్యమాని, దేశంలోని కార్మిక వర్గానికి విశేష సేవలందించిన ఏచూరి సీతారామ్ ఆశయాలకు అనుగుణంగా అంతా పని చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జేఎన్‌వీ గోపాలన్ అన్నారు. స్థానిక మెంటేవారితోట సీపీఎం కార్యాలయంలో ఏచూరి వర్ధంతి సభను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో చింతకాయల బాబూరావు, బి.వాసుదేవరావు, కవురు పెద్దిరాజు పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌లో కేసుల రాజీ



లోక్ అదాలత్‌లో పాల్గొన్న న్యాయమూర్తులు

భీమవరం: మండల న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో సంస్థ చైర్మన్, 3వ అదనపు జిల్లా జడ్జిగా పూర్తి అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి డాక్టర్ బి.లక్ష్మి నారాయణ అధ్యక్షతన కోర్టుల ప్రాంగణంలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ జాతీయ లోక్ అదాలత్‌లో ప్రిసైడింగ్ న్యాయమూర్తులుగా మూడో అదనపు జిల్లా జడ్జి లక్ష్మినారాయణ, సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) ఎం.సుధారాణి, ప్రిన్సిపాల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) జి.సురేష్ బాబు, ఒకటో అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) పి. హనీష, 2వ అదనపు జుడీషియల్ మొదటి తరగతి మేజిస్ట్రేట్ ఎస్.జ్యోతి కేసులను పరిష్కరించారు. న్యాయవాద సభ్యులుగా పి.విజయ్ కుమార్ బాబు, కె.విజయ లక్ష్మి, ఎ.నటరాజ్, ఎ.శివాజీరాజు, ఆర్.క్యాస్ట్రో వ్యవహరించారు. జాతీయ లోక్ అదాలత్ లో 24 సివిల్ కేసులు, 625 క్రిమినల్ కేసులు, 13 ప్రీ లిటిగేషన్ కేసులు మొత్తం 662 కేసులు రాజీ అయ్యాయి. రెండు కేసుల్లో భార్య భర్తల మధ్య రాజీ కుదిర్చి కలిపారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యేలేటి యోహాను, న్యాయవాదులు, కక్షిదారులు పాల్గొన్నారు.

22 నుంచి దసరా సెలవులివ్వాలి

భీమవరం: దసరా ఉత్సవాలు మహాలయ అమావాస్య రోజు అంటే ఈ నెల 22 నుంచే ప్రారంభతున్నాయి కాబట్టి పాఠశాలలకు కూడా అదే రోజు నుంచి సెలవులు ప్రకటించాలని ఫ్యాప్టో జిల్లా చైర్మన్ పి.విజయరామరాజు, సెక్రటరీ జనరల్ జి.ప్రకాశం కోరారు. ఈ మేరకు శనివారం వారు ఒక ప్రకటన విడదుల చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 24 నుంచి సెలవులు ప్రకటించడం సరైంది కాదని మండిపడ్డారు. తెలంగాణలో కూడా సెప్టెంబర్ 22 నుంచి దసరా సెలవులు ప్రకటించారు కాబట్టి ఈ నెల 22 నుంచి అక్టోబర్ 3 వరకు దసరా సెలవులు ప్రకటించాలని కోరారు.

వృద్ధాశ్రమానికి కుర్చీల అందజేత



వృద్ధాశ్రమానికి అందించిన కుర్చీల్లో వృద్ధులు

భీమవరం: స్థానిక స్టేట్ బ్యాంక్ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం గునుపూడిలోని ప్రేమాలయం వృద్ధాశ్రమానికి పవర్ బ్యాటరీ, ఇన్వర్టర్ యూనిట్, తాడేరు రోడ్డులోని వృద్ధుల ఆశ్రమానికి 20 కుర్చీలు అందజేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ మేనేజర్ డి రామ్‌కుమార్ విచ్చేసి మాట్లాడుతూ స్టేట్ బ్యాంక్ పెన్షనర్స్ భీమవరం క్లబ్ తరపున వృద్ధాశ్రమాల్లో జీవిస్తున్న వృద్ధుల అవసరాలు తెలుసుకుని అవసరమైన సామగ్రిని అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో స్టేట్ బ్యాంక్ అసోసియేషన్ భీమవరం క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు గజపతిరాజు, ఆదిశేషులు, అల్లు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా చెస్ టోర్నమెంట్



భీమవరంలో ఇన్విటేషన్ ఓపెన్ ర్యాపిడ్ చెస్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

భీమవరం: స్థానిక అనసూయ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో ఇన్విటేషన్ ఓపెన్ ర్యాపిడ్ చెస్ టోర్నమెంట్ ఆర్యవైశ్య యువజన సంఘం భవనంలో శనివారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు మాదాసు కిషోర్ మాట్లాడుతూ పోటీల్లో ఆరు విభాగాలలో గెలుపొందిన విజేతలకు రూ. 20 వేలు నగదు బహుమతులు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి గమిని రవిపవన్ కుమార్, సంయుక్త కార్యదర్శి మైలాపురి మురళి, తటవర్తి శ్రీనివాస్, సునీల్ అగర్వాల్, అల్లు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

భీమవరం: స్థానిక విష్ణు ఉమెన్స్ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం గ్రాడ్యుయేషన్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల వైస్‌చైర్మన్ ఆర్.రవిచంద్రన్ విద్యార్థినులకు సర్టిఫికెట్లను అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.